సాక్షి సంగారెడ్డి

బుధవారం । 17 । సెప్టెంబర్ । 2025



చెరగని జ్ఞాపకాలు..

నాటి దోపిడీ, వెట్టి, పెత్తందారి వ్యవస్థ, అరాచకాలపై పోరాడిన వీరులు.. అనాటి ఘటనలు.. వివరాలు 8లో ▸



చరిత్రను వక్రీకరిస్తే..

బీజేపీ నాయకులు నాటి చరిత్రను వక్రీకరిస్తున్నారని సీపీఎం నేత జాన్ వెస్లీ మండిపడ్డారు. వివరాలు 8లో ▸



పారిశుద్ధ్యం ప్రశ్నార్థకమే!

పారిశుద్ధ్య నిర్వహణను నిత్యం పర్యవేక్షించాల్సిన అధికారులు ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. వివరాలు 9లో ▸

బడిలో సందడి చేసి..



ఎద్దుమైలారం పాఠశాల విద్యార్థులతో జపాన్ విద్యార్థుల బృందం

కంది(సంగారెడ్డి): సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఐఐటీ హైదరాబాద్ చొరవతో కంది మండల పరిధిలోని ఎద్దుమైలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జపాన్‌లోని విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థుల బృందం మంగళవారం సందర్శించింది. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో కలిసి ఆటలు ఆడి, చదువుతున్న తీరును, సంస్కృతి సంప్రదాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఇన్‌చార్జి ఎంఈఓ జోగప్ప, ఐఐటీ ప్రొఫెసర్ హేమంత్ నూతలపాటి పాల్గొన్నారు.

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం పట్టణ పరిధిలోని వావిలాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో హిందీ పండిట్ మాధవీలత విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజారావు శర్మ, ఋషి, రాజిరెడ్డి, జయలత, పవన్ రాజ్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



వివిధ పాత్రల వేషధారణలో విద్యార్థులు

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన ఉండాలి

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య



సంగారెడ్డి టౌన్ : విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య పేర్కొన్నారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో మంగళవారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి బాగోగులను తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గౌడలకు రక్షణ కల్పించాలి

కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్



నిరసన తెలుపుతున్న కల్లుగీత కార్మిక సంఘం నాయకులు

సంగారెడ్డి టౌన్: గౌడ కులస్తులకు గ్రామాల్లో రక్షణ కల్పించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా తాళ్ల రాంపూర్ గ్రామంలోని గౌడ కులానికి చెందిన వారిని విడిసి పేరుతో గ్రామ బహిష్కరణ చేసి దౌర్జన్యం చేసిన వారిని వెంటనే శిక్షించాలని కోరారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ...గౌడలకు రక్షణ కల్పించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్నగౌడ్, ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లతో భర్తీ చేయండి



సభ్యత్వాన్ని నమోదు చేస్తున్న రాజిరెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం, గడ్డపోతారం మున్సిపాలిటీల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పడిన ఖాళీలను తక్షణమే విద్యా వలంటీర్లతో భర్తీ చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రాజారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిన్నారంలో ఆయన విలేకరులతో మంగళవారం మాట్లాడుతూ...ఇటీవల మున్సిపాలిటీల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదోన్నతులపై వెళ్లడంతో ఖాళీలు ఏర్పడ్డాయన్నారు. పలు పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

పోరాటాలకు సిద్ధం కావాలి: రాజయ్య

జహీరాబాద్ టౌన్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాజయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని శ్రామిక్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభకు ఆయన హాజరై మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ నుంచి విముక్తి కోసం పోరాటం చేసిందని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యుడు బి.రాంచందర్, నాయకులు మహి పాల్, సలీమొద్దీన్ పాల్గొన్నారు.

51% షురువైన ఇళ్లు

సగానికిపైగా దాటిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

- గాడిన పడుతున్న గృహ నిర్మాణ పథకం
- ముందంజలో జహీరాబాద్ నియోజకవర్గం.. చివరి స్థానంలో పటాన్‌చెరు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం ఇప్పుడిప్పుడే గాడిన పడుతోంది. లబ్ధిదారులకు మంజూరైన గృహాల్లో ఇప్పటివరకు సగం మంది ఇళ్ల నిర్మాణానికి పూనుకున్నారు. బిల్లులు వస్తాయో రావోన్న భయం ఒకవైపు.. నిబంధనలు మరోవైపు.. ఇలా పలు కారణాలతో ఇళ్లు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభించుకునేందుకు ఇన్నాళ్లు లబ్ధిదారులు ఆచితూచి వ్యవహరించారు. ఇప్పుడా పరిస్థితులు మారుతున్నాయి. గృహాలు మంజూరైన వారిలో సగానికి పైగా లబ్ధిదారులు ముగ్గు పోసుకున్నారు. ఈ పథకం గ్రౌండింగ్ రిపోర్టును పరిశీలిస్తే సుమారు 51.10 శాతం మంది లబ్ధిదారులు ఈ ఇళ్ల నిర్మాణం ప్రారంభించుకున్నట్లు ఆ శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

గృహాలకు ముగ్గు పోసిన ఇళ్లు 7,429

ప్రభుత్వం జిల్లాకు మొత్తం 16,559 గృహాలను కేటాయించగా...ఇప్పటి వరకు 14,538 మంది అర్హులైన లబ్ధిదారులుగా ఉన్నట్లు ఎంపీడీఓలు తేల్చారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపగా, జిల్లా కలెక్టర్ ఈ గృహాలకు మంజూరు ఇచ్చారు. ఇందులో మొత్తం 7,429 ఇళ్ల నిర్మాణాలకు ముగ్గులు పోసుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అంటే 51 శాతం మంది ఇంటి నిర్మాణాలను ప్రారంభించినట్లు లెక్క. ఇందులో బేస్‌మెట్ వరకు నిర్మించుకున్న గృహాలు 4,509 ఉండగా, స్లాబ్ స్థాయి వరకు పూర్తయిన ఇళ్లు 786 ఉన్నాయి. స్లాబులు కూడా పూర్తయిన ఇండ్లు 233 ఉన్నాయి. గృహ ప్రవేశానికి సిద్ధమైన ఇళ్లు ఆరు ఉన్నాయి.

జహీరాబాద్ మొదటి స్థానంలో..



ఈ గృహాల నిర్మాణంలో జహీరాబాద్ నియోజకవర్గం జిల్లాలోనే మొదటి స్థానంలో ఉంది. ఈ నియోజకవర్గానికి 3,483 గృహాలు మంజూరు కాగా, ఇప్పటికే 2,371 గృహాలకు ముగ్గు పోసుకున్నారు. ఈ నియోజకవర్గంలో బేస్‌మెంట్ వరకు కట్టుకున్న ఇళ్లు కూడా ఎక్కువగానే ఉన్నాయి. మొత్తం 1,872 ఇళ్లు బేస్‌మెంట్ వరకు పూర్తయ్యాయి. ఇక పటాన్‌చెరు నియోజకవర్గం చివరి స్థానంలో ఉంది. ఇక్కడ 3,500 గృహాలు కేటాయించినప్పటికీ, ఇప్పటికీ 695 గృహాలకు మాత్రమే ముగ్గు పోసుకున్నారు. బేస్‌మెంట్ వరకు కట్టుకున్న ఇళ్లు కూడా 312 మాత్రమే ఉన్నాయి.

మరుగుదొడ్డి విషయంలో

గ్రామీణ ప్రాంతాల్లో ఇంట్లో మరుగుదొడ్డి కట్టుకోవడానికి ఇప్పటికీ అనేకమంది ఆసక్తి చూపరు. ఇంటి ఆవరణలో..ఇంటి ముందు గానీ, వెనుక గానీ కట్టుకుంటారు. ఇంటి ఆవరణలో కట్టుకున్నప్పటికీ మరుగుదొడ్డితో కలిపి ఇంటి నిర్మాణం 600 చదరపు అడుగులకు మించవద్దనే నిబంధన ఉంటుందని అధికారులు చెబుతున్నారు. పట్టణాల్లో ఇంట్లోనే మరుగుదొడ్డి ఉంటుందని, గ్రామాల్లో కూడా అలాగే ఉంటే బాగుంటుందని లబ్ధిదారులకు చెబుతున్నారు. బయట ఉంటే రాత్రి వేళల్లో విషపురుగులు కుట్టే ప్రమాదం ఉంటుందని వారిలో అవగాహన పెంచుతున్నారు. ప్రధానంగా మహిళల భద్రత, గౌరవాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంట్లోనే మరుగుదొడ్డి ఉండేలా చూసుకోవాలని చెబుతున్నారు.

అంకితభావంతో పనిచేయాలి: ఎస్పీ

హత్నూర పీఎస్ ఆకస్మిక తనిఖీ

హత్నూర (సంగారెడ్డి): విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ పేర్కొన్నారు. హత్నూర పోలీస్‌స్టేషన్‌ను ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన ప్రతి పోలీసుకు గుర్తింపు లభిస్తుందన్నారు. సిబ్బందికి విధుల పరంగా వ్యక్తిగతంగా ఎలాంటి సమస్యలు వచ్చినా ఎస్పీ కార్యాలయంలో తను నేరుగా కలవచ్చని సూచించారు. పోలీస్ స్టేషన్ రికార్డులు మెయింటెనెన్స్ బాగుందని ఎస్ఐ శ్రీధర్‌రెడ్డితోపాటు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. సైబర్ నేరాలపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన పెంచాలని తెలిపారు. ఎస్పీ పరితోశ్ వెంట డీఎస్పీ ప్రభాకర్, సీఐ నయీముద్దీన్, ఎస్సై శ్రీధర్‌రెడ్డి, సీసీ వినయ్ సిబ్బంది ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ పరితోశ్ పంకజ్

వందరోజుల్లో అమీన్‌పూర్‌కు రోడ్డు

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌కు ఎంపీ ఎం.రఘునందన్‌రావు వినతి



భెల్ చౌరస్తా వద్ద పర్యటిస్తున్న రఘునందన్‌రావు, కర్ణన్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భెల్ చౌరస్తా నుంచి అమీన్‌పూర్ మీదుగా సుల్తాన్‌పూర్ మెడికల్ డివైజ్ పార్కు వరకు వందరోజుల్లో రోడ్డును పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను ఎంపీ ఎం.రఘునంద న్‌రావు కోరారు. మంగళవారం రామచంద్రాపురం పట్టణంలోని భెల్ చౌరస్తాలో కర్ణన్‌తో కలసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భెల్ చౌరస్తాలోని జాతీయరహదారి నుంచి రింగ్‌రోడ్డు వరకు రూ.వందకోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణం తన ప్రధాన లక్ష్యమన్నారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని వివరించారు. నాలాగా మారిన చిన్నవాగులోని ఆక్రమణలను వెంటనే తొలగించి దానిపై వంతెన నిర్మించాలని ఆదేశించారు. ఈ రహదారి పూర్తయితే అమీన్‌పూర్, బొల్లారం ప్రాంతంలోని ప్రజలతో పాటు శేరిలింగంపల్లి ప్రజలకు రింగ్ రోడ్డు ప్రయాణం సులభతరమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో దిశ కమిటీ సభ్యులు కాసాల సుధాకర్, నాయకులు ఎడ్ల రమేశ్, నర్సింగ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌దుకాణం తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 53వ నంబరు రేషన్ దుకాణాన్ని స్థానిక సబ్ కలెక్టర్ ఉమాహారతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణం ఎదుట గోడపై ఏర్పాటుచేసిన నిల్వలపట్టిక బోర్డు, దుకాణంలో తూకపు యంత్రం , రేషన్ సరుకులు నిల్వ ఉంచే చోటును పరిశీలించారు. దుకాణం పరిధిలో రేషన్ లబ్ధిదారుల సంఖ్య, సరఫరా అయ్యే సరకులు తదితర విషయాలను డీలరు సంతోషిరాణిని అడిగి తెలుసుకున్నారు. దుకాణాన్ని శుభ్రంగా ఉంచి లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఆమె వెంట పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దారు మహేశ్, ఆర్ఐ మాధవరెడ్డి, గ్రామ పాలనాధికారి సుధాకర్ ఉన్నారు.



నిల్వ పట్టికను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

సీఎం పర్యటనలోగా డీపీఆర్ సిద్ధం

- ఇంజనీరింగ్ అధికారుల సమావేశంలో జగ్గారెడ్డి ఆదేశం
- 30లోగా మంజీరా తాగునీటి పథకం అంచనాలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగారెడ్డి పర్యటన నేపథ్యంలో మంజీరా తాగునీటి పథకానికి సంబంధించిన అంచనాలను ఈనెల 30 లోగా సిద్ధం చేయాలని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అధికారులకు సూచించారు. కన్సల్టెన్సీ కంపెనీ ఈ డీపీఆర్‌లను సిద్ధం చేయాలన్నారు. జిల్లా పరిషత్ సమావేశమందిరంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్, పబ్లిక్‌హెల్త్, నీటిపారుదల, మిషన్ భగీరథ, మున్సిపల్ కమిషనర్లతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ...సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలకు రానున్న 50 ఏళ్ల జనాభాకు సరిపడేలా ఈ తాగునీటి పథకాల పైప్‌లైన్లు, ఇంటెక్ వెల్‌లు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, ఫిల్టర్‌బెడ్‌లను డిజైన్ చేయాలన్నారు. తాళ్లపల్లి ఫిల్టర్ బెడ్ ఆధునీకరణ, సంగారెడ్డి, కంది, సదాశివపేట, కొండాపూర్ మండలాల్లోని 54 గ్రామాల ప్రజలకు తాగునీటి సరఫరాకు పైప్‌లైన్ల మరమ్మతులకు రూ.15 కోట్లతో ప్రతిపాదనలు పంపాలని సూచించారు. సదాశివపేట మున్సిపాలిటీకి 25 ఎంఎల్‌డీ, సంగారెడ్డికి 50 ఎంఎల్‌డీ నీటి కేటాయింపుల కోసం నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆ శాఖ ఈఎన్‌సీలకు ప్రతిపాదన లేఖలు పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, ఆయా శాఖల పర్యవేక్షక ఇంజనీర్లు, డీఈలు, మున్సిపల్ కమిషనర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగ్గారెడ్డి దంపతులు

డీజేఎఫ్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

సంగారెడ్డి టౌన్: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సెప్టెంబర్ 19న జరగనున్న దళిత జర్నలిస్ట్ ఫోరం 10వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను మంగళవారం సంగారెడ్డిలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తలారి యాదగిరి, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాపాక విజయరాజు, సీనియర్ జర్నలిస్టులు దేవదాస్ పాల్గొన్నారు.

ఖేడ్ గురుకులం ప్రిన్సిపాల్ బదిలీ



శ్రీనివాస్ నాయక్

నారాయణఖేడ్: నారాయణఖేడ్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులం ప్రిన్సిపాల్ శ్రీనివాస్ నాయక్ బదిలీ అయ్యారు. ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్ నాయక్ బాధ్యతలు చేపట్టిన అనంతరం పాఠశాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతోపాటు విద్యార్థులు గజ్జి, తామరతో సతమతమయ్యారు. ఈ విషయాలు పత్రికల్లో రావడంతో ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాఠశాలను తనిఖీ చేసి గురుకులం నిర్వహణ తీరుపై, ప్రిన్సిపాల్ వ్యవహార శైలిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ సెక్రెటరీ తిరుపతి, ఆర్సీవో గౌతమిరెడ్డి విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. దీంతో ప్రిన్సిపాల్‌ను జూబ్లిహిల్స్ పాఠశాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జేఏల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రతిభకు ఇన్‌చార్జీ బాధ్యులు అప్పగించారు.

నేడు ప్రజా పాలన వేడుకలు

సంగారెడ్డి జోన్: అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ప్రజాపాలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వేదిక ఏర్పాటు, పోలీసు భద్రత, పరిశుభ్రత, పారిశుద్ధ్యం, తాగునీరు వసతి, విద్యుత్ సరఫరా ఏర్పాటుతోపాటు అత్యవసర అవసరాలకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ పద్మజారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మళ్లీ టెర్మినల్ ప్రతిపాదనలు

- ఈదులనాగులపల్లిలో ఏర్పాటుకు చిగురిస్తున్న ఆశలు
- టెర్మినల్ రాకతో మెరుగుపడనున్న ప్రజా రవాణ వ్యవస్థ!
- ఇటీవల కేంద్రమంత్రిని కలిసి విన్నవించిన ఎంపీ రఘునందన్‌రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులనాగులపల్లిలో రైల్వే టెర్మినల్ అంశం మరోసారి తెరపైకి రావడంతో స్థానిక ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కొన్నేళ్లుగా టెర్మినల్ ప్రతిపాదనలు వినిపిస్తున్నప్పటికీ అమలుకు నోచుకోవడంలేదు. ప్రస్తుతం తెల్లాపూర్‌వైపు శరవేగంగా అభివృద్ధి జరుగుతోంది. దీంతో రైల్వే టెర్మినల్ ప్రతిపాదనలు మరోసారి ముందుకురావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టెర్మినల్‌ను అభివృద్ధి చేస్తే ప్రజా రవాణ వ్యవస్థ మరింత మెరుగుపడే అవకాశం ఉంటుంది.

ఈదులనాగులపల్లి అనువైన ప్రాంతం..

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లు ప్రయాణికులకు సరైన విధంగా సేవలందించలేకపోతోంది. గతంలో రైల్వే అధికారులు దీనిపై నివేదిక సమర్పించిన సంగతి తెలిసిందే. అందులోభాగంగా చర్లపల్లి, ఈదులనాగులపల్లిలో రైల్వే టెర్మినల్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇక్కడ టెర్మినల్ ఏర్పాటైతే దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే రైళ్లను ఇక్కడ నుంచి నడిపించే అవకాశం ఉంటుందని రైల్వే అధికారులు చెబుతున్నాయి. హైదరాబాద్, ముంబై వెళ్లే మార్గంలోనే ఈదులనాగులపల్లి ఉండటం, ప్రస్తుత ప్లాట్‌ఫామ్‌లతోపాటు మరిన్ని ప్లాట్‌ఫామ్‌లను పెంచడానికి అనుకూలమైన ప్రాంతంగా అధికారులు ఆ ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. అయితే అప్పటి జిల్లా రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో భూసేకరణ సజావుగా సాగలేదు. ఎంపీ రఘునందన్‌రావు ప్రత్యేక కృషితో టెర్మినల్ ఏర్పాటుపై మళ్లీ చర్చలు మొదలయ్యాయి.

ప్రయాణం మరింత సులభం

పటాన్‌చెరు పారిశ్రామికవాడ కావడంతో దేశంలోని ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఈ ప్రాంతంలో నివసిస్తున్నారు. వారు సొంతగ్రామాలకు పోవాలంటే సికింద్రాబాద్, నాంపల్లిలోని రైల్వేస్టేషన్‌కు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ట్రాఫిక్ సమస్యతో సకాలంలో రైల్వేస్టేషన్‌కు చేరుకోలేకపోతున్నారు. ఈ ప్రాంతంలో టెర్మినల్ ఏర్పాటైతే స్థానిక యువతతోపాటు వేలాదిమందికి ఉపాధి కలుగుతుందని, అభివృద్ధితోపాటు వాణిజ్య, రియల్ వ్యాపారం పెరిగే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయడుతున్నారు.

రైల్వేస్టేషన్‌ను సందర్శించిన కేంద్ర రైల్వే సహాయ మంత్రి

ఇటీవల బీదర్‌కు వెళుతున్న కేంద్ర రైల్వే సహాయమంత్రి సోమన్నను ఈదులనాగులపల్లి రైల్వేస్టేషన్ వద్ద ఎంపీ రఘునందన్‌రావు ఆపి సమస్యను వివరించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ఇక్కడి వసతులను చూపించారు. ఇక్కడ రైల్వే టెర్మినల్ ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరగడంతోపాటు రైల్వే శాఖ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించవచ్చని వివరించి వినతిపత్రం అందజేశారు.



ఈదులనాగులపల్లి రైల్వే స్టేషన్

టెర్మినల్ ఎంతో అవసరం



ఈ ప్రాంతంలో అనేక రాష్ట్రాల ప్రజలు నివాసముంటున్నారు. వారు సొంత రాష్ట్రాలకు వెళ్లాలంటే సికింద్రాబాద్, నాంపల్లి రైల్వేస్టేషన్‌లకు పోతున్నారు. ట్రాఫిక్ కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ టెర్మినల్ ఏర్పాటైతే వారి ప్రయాణం సులభంగా మారుతుంది. టెర్మినల్ ఏర్పాటుకు అవసరమైన భూమి కూడా అందుబాటులోనే ఉంది. ఈ విషయాన్ని సంబంధిత కేంద్రమంత్రుల దృష్టికి తీసుకెళ్లాం.

– ఎం.రఘునందన్ రావు, ఎంపీ

మరింత అభివృద్ధి జరుగుతుంది



ఈదులనాగులపల్లి రైల్వే టెర్మినల్ ఏర్పాటు చేయాలని గతంలో ప్రభుత్వాలను కోరాం. రైల్వే టెర్మినల్ ఈప్రాంత ప్రజలకు ఎంతో అవసరం. దాని వలన ఈప్రాంతం మరింత వేగంగా అభివృద్ధి జరుగుతుంది. ఇందుకోసం తనవంతు కృషి చేస్తాను.

– గూడెం మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులు

ముగ్గురికి గోల్డ్ మెడల్స్



గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులు

మెదక్ కలెక్టరేట్: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మెదక్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి గోల్డ్‌మెడల్ సాధించినట్లు రెంజుకి షోటోకాన్ కరాటే వ్యవస్థాపక అధ్యక్షుడు మాస్టర్ నగేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14, 15 తేదీల్లో ముంబైలోని బీవండిలో జాతీయ స్థాయి కరాటే పోటీలు జరిగాయి. బ్రేవైస్ యూత్ ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో మెదక్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు బ్లాక్ బెల్టు విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. అండర్ 13లో స్వరూప్ సింగ్, అండర్ 16లో అబ్దుల్లా , అండర్ 17లో సూరజ్.. గోల్డ్ మెడల్స్‌తోపాటు చాంపియన్‌షిప్ కూడా గెలుచుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజర్ రాజారామ్, కేశవ్ మాస్టర్స్ , విద్యార్థులను అభినందిచారు.

శతాధిక వృద్ధురాలు మృతి



సందిగారి లింగమ్మ

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామంలో శతాధిక వృద్ధురాలు సందిగారి లింగమ్మ(108) మంగళవారం మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె భర్త భూమగౌడ్ 50 ఏళ్ల క్రితమే మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉండగా, పెద్ద కుమారుడు పదేళ్ల క్రితం మృతి చెందగా, చిన్న కుమారుడు నారాగౌడ్ తల్లి అంత్యక్రియలు నిర్వహించారు. మనవలు, మునిమనవలను చూసిన ఆమె వృద్ధాప్యంతో మృతి చెందారు.

బెల్లం, పట్టిక పట్టివేత

హుస్నాబాద్: హుస్నాబాద్ నుంచి రామవరం వెళ్లే దారిలో సోమవారం రాత్రి కారులో తరలిస్తున్న బెల్లంను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ పవన్ వివరాల ప్రకారం ... టాటా ఇండికా కారులో తరలిస్తున్న 180 కిలోల బెల్లం, 20 కిలోల పట్టిక, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దిడిగం మనోజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడు గతంలో గుడుంబా తయారీదారులకు బెల్లం, పట్టిక సరఫరా చేసిన కేసులో పట్టుబడి బైండోవర్ కూడా ఉల్లంఘించినట్లు తెలిపారు. ఈ దాడిలో పాల్గొన్న ఎస్సై దామోదర్, కానిస్టేబుళ్లు ఆరీఫ్, రాజు, సతీశ్, రజితను అభినందించారు.

గాంధీనగర్‌లో డెంగీ

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని గాంధీనగర్‌కు చెందిన ఓ మహిళ డెంగీ బారిన పడటంతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. మంగళవారం మండల వైద్యాధికారి డాక్టర్. మైమూన, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో జ్వరపీడుతుల సర్వే చేపట్టారు. డెంగీ బాధితురాలి ఇంటి చుట్టూ దోమల మందు స్ప్రే చేయించారు. గ్రామాల్లో ఇంటింటికి ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయించాలని డాక్టర్ మైమూన సూచించారు.

పిడుగుపాటుకు గేదె మృతి

న్యాల్‌కల్(జహీరాబాద్): పిడుగుపాటుకు గురై పాడి గేదే మృత్యువాత పడింది. మండల పరిధిలోని డప్పూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొండె రవి రోజు మాదిరిగా ఉదయం తన గేదెను మేత మేపేందుకు పొలానికి తీసుకువెళ్లాడు. 11.30 గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో వర్షం మొదలై ఒక్కసారిగా గేదెపై పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ రూ.90 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

గల్లంతైన బాలుడి మృతి

జహీరాబాద్ టౌన్: ఈతకు వెళ్లిన బాలుడు నీటి కుంటలో గల్లంతై మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలో జరిగింది. రూరల్ ఎస్ఐ.కాశీనాథ్ కథనం ప్రకారం... కోహీర్ మండలం పిచరాగడి గ్రామానికి చెందిన రిజ్వాన్(17) స్నేహితులు సలీం, గుల్లుతో కలిసి హుగ్గెల్లి గ్రామ శివారులో గల నీటి కుంటలో ఈత కొట్టేందుకు వచ్చి నీట మునిగిన విషయం తెలిసిందే. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సోమవారం కుంటలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం ఉదయం గాలింపు చేపట్టగా బాలుడి మృతదేహం లభ్యమైంది.

చెరగని జ్ఞాపకాలు..

నాటి పోరాటాలు



దోపిడీ, వెట్టి చాకిరీ, పెత్తందారి వ్యవస్థ, అరాచకాలకు పాల్పడుతున్న నిజాం రజాకార్లకు ఎదురొడ్డి పోరాటం చేశారు. వారిని నిలువరిస్తూ దళాలు కట్టి పలు ప్రాంతాలకు చెందిన ఎంతో మంది సాయుధ తెలంగాణ పోరాటంలో అసువులు బాశారు. అప్పట్లో జిల్లాలో జరిగిన హింసాత్మక ఘటనలు, కాల్పులు, చెరిగిపోని గుర్తులపై కథనాలు.

అప్పటి ఘటనలు ఇంకా ప్రజల మదిలో..


- అసువులు బాసిన ఎంతో మంది వీరులు
- సెప్టెంబర్ 17 సందర్భంగా ప్రత్యేక కథనాలు



బైరాన్‌పల్లి బురుజు

ఏడాదికి ఒకసారి యాదికొస్తాం

సాయుధ పోరాట యోధుడు చల్లా చంద్రారెడ్డి ఆవేదన



సమర యోధుడు చల్లా చంద్రారెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): భారత దేశానికి స్వాతంత్య్రం వచ్చినా హైదరాబాద్ సంస్థానం మాత్రం నిజాం పాలనలో బిక్కుబిక్కు మంటూనే గడిపింది. భారత్‌లో విలీనం చేయాలన్న ప్రజల ఆకాంక్షలు, ప్రతిఘటనలు, పోరాటాల రూపంలో తెరపైకి రావడం మొదలైంది. వీటన్నింటికి పరాకాష్టగా బైరాన్‌పల్లి నరమేధం కలకలం రేపింది. సెప్టెంబర్ 17 నాటికి హైదరాబాద్ సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనమైంది. తెలంగాణ పోరాట యోధుడు చల్లా చంద్రారెడ్డిని సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూ చేయగా ఆయన పలు విషయాలను వెల్లడించారు. నాడు రజాకార్లు రైతులను, మహిళలను అవమాన పరుస్తూ అనేక హత్యలు, అత్యాచారాలు చేశారని, దీన్ని ఎదుర్కొని బైరాన్‌పల్లి గ్రామంలో బురుజు పైనుండి రజాకార్ల సైన్యాన్ని తిప్పి కొట్టామని తెలిపారు. అందులో తోటి మిత్రులు, వృద్ధులు అనేక మంది వీరమరణం పొందారని చెప్పారు. ఆ పోరాటంలో పాల్గొన్న చివరి వ్యక్తిని తానే అన్నారు. నాయకులకు ఏడాదికి ఒకసారి మాత్రమే గుర్తుకొస్తామన్నారు. బైరాన్‌పల్లి ఘటనను పాఠ్యాంశాల్లో ఎక్కించి , అమరవీరుల పేర్లను బురుజుపై రాయించాలన్నారు. వారి కుటుంబాలను ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

ఎదురొడ్డి నిలబడిన మహ్మదాపూర్



మహ్మదాపూర్‌లో వీరుల జ్ఞాపకార్థం నిర్మించిన స్తూపం




12 మంది వీరుల మరణానికి గుర్తుగా నిర్మించిన శిలాఫలకం

హుస్నాబాద్ రూరల్: హుస్నాబాద్ ప్రాంతంలో కొనసాగిన దొరలు, పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా కరీంనగర్ జిల్లా పాలంపల్లికి చెందిన అనభేరి ప్రభాకర్‌రావు, సిరిసిల్ల జిల్లా లక్ష్మీపూర్‌కు చెందిన సింగిరెడ్డి భూపతిరెడ్డి దళాలు ఈ ప్రాంత ప్రజలను చైతన్యం చేస్తూ వెట్టి చాకిరికి విముక్తి కల్పించారు. 1948 మార్చి 14న అటవీ సమీపంలోని మహ్మదాపూర్‌కు అనభేరి ప్రభాకర్‌రావు , సింగిరెడ్డి భూపతిరెడ్డి దళాలతో ఊరికి చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న రజాకారులు వారు భోజనం చేసే సమయంలో దాడికి దిగారు. ఈ కాల్పుల్లో 12 మంది వీరమరణం పొందారు. ఈ ఘటన జరిగిన ఆరు నెలలకు నిజాం నవాబు లొంగిపోయాడు. సాయుధ పోరాటంలో వీరమరణం పొందిన వీరుల జ్ఞాపకార్థం గుట్ట కింద అనభేరి ప్రభాకర్‌రావు, సింగిరెడ్డి భూపతి సమాధులు నిర్మించి ప్రతి ఏటా సెప్టెంబర్ 17న, మార్చి 14 న కమ్యూనిస్టులు నిర్వహించే సభలకు ప్రజలు పార్టీలకు అతీతంగా హాజరై వీరులకు నివాళులర్పిస్తారు.



మెదక్ బాలభారతి మండలి సభ్యులు 1948లో ఖిల్లాపై ఎగురవేసిన జాతీయజెండా

నిజాంను నిలువరించిన ధీరులు



చోళ లింగయ్య

మెదక్‌జోన్: రజాకార్ల అరాచకాలకు బలైన ప్రాంతాల్లో మెదక్ కూడా ఒకటి. మెదక్ పట్టణం అరబ్‌గల్లీకి చెందిన అన్నదమ్ములైన బట్టి కిష్టయ్య, బట్టి వెంకయ్యలతో పాటు కేవల్ కిషన్, బళ్లాల బాబయ్య, సిల్వర్ రాజయ్య, గంగారం ఈశ్వరయ్య, గులాం దస్తగిరితో పాటు మొత్తం 80 మంది సభ్యులు బాలభారతీ మండలి పేరుతో సంఘం పెట్టారు. ఎక్కడికక్కడ రజాకార్లు చేసే అకృత్యాలను అడ్డుకోవటం, దాడులకు ప్రతి దాడులు చేస్తూ నిలువరించినట్లు నేటికీ ఇక్కడి ప్రజలు చెప్పుకుంటారు.

ఉద్యోగాన్ని వదిలి పోరాటంలో చేరి..

మెదక్ పట్టణానికి చెందిన చోళ లింగయ్య స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఆర్మీ ఎయిర్స్ ఫోర్స్ విభాగంలో గ్రౌండ్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఆజాద్ హింద్ ఫౌజ్ 'స్థాపనకు సుభాష్ చంద్రబోస్ పిలుపునందుకుని ఉద్యోగానికి రాజీనామా చేసి ఉద్యమంలో చేరాడు. సుభాష్‌చంద్రబోస్ విమాన ప్రమాదంలో మరణించాక చోళ లింగయ్య తిరిగి మెదక్‌కు వచ్చారు. ఈ ప్రాంతంలో రజాకార్లకు వ్యతిరేకంగా ఏర్పాటైన బాలభారతీ మండలి సభ్యులతో జత కట్టాడు. రజాకారుల దాడులను తిప్పికొట్టేందుకు ప్రత్యేకంగా దళాల ఏర్పాటు, తుపాకులు, బాంబులు తయారు చేశాడు. 1947 ఆగస్టు 15న జాతీయ పతాకాన్ని మెదక్‌లోని పటేల్ కుంటలో మండలి సభ్యులతో కలిసి ఎగరవేశారు. దీంతో పోలీసులు లింగయ్యతో పాటు కొందరిని ఔరంగాబాద్ జైలులో 7 మాసాల పాటు నిర్బంధించారు. అనంతరం సర్దార్ పటేల్ మిలిటరీ యాక్షన్‌తో తెలంగాణకు విముక్తి లభించగా జైలు నుండి బయటకు వచ్చారు. కాగా చోళ లింగయ్య 2010లో చనిపోయారు.



రాయికోడ్: కాల్పులు జరిగిన గౌని ప్రాంతం

రజాకార్ల తూటాలకు..

రాయికోడ్(అందోల్): తెలంగాణ సాయుధ పోరాటంలో రాయికోడ్ వాసులు పాల్గొన్నారు. ఈ పోరాటానికి సంఘీభావంగా కొనసాగిన ఆర్యసమాజ్ ర్యాలీని గ్రామానికి ఆహ్వానించారు. నిజాం సర్కారు ర్యాలీకి అనుమతివ్వలేదు. ర్యాలీ గ్రామంలోని గౌని ప్రాంతానికి చేరుకోగానే ఉద్యమకారులు, రజాకార్లకు మధ్య ఘర్షణలు జరిగాయి. రజాకార్లు ర్యాలీలోని ఉద్యమకార్లపై కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో 14 మంది గ్రామస్తులు అమరులయ్యారు. ర్యాలీలో పాల్గొన్నందుకు 8 మందికి నిజాం ప్రభుత్వం జైలు శిక్ష విధించింది. అనంతరం రజాకార్లు రెచ్చిపోయి గ్రామంలోని ఇళ్లలో ఉన్న ధనం, ధాన్యాన్ని లూటీ చేశారు. ఉద్యమ కుటుంబాల ఇళ్లకు నిప్పంటించగా ఇళ్లు, సామగ్రి, పంట ఉత్పత్తులు కాలిబూడిదయ్యాయి. అప్పటి ఉద్యమకారులు, సమిధలైన వారి జ్ఞాపకాలు ఇంకా గ్రామస్తుల మదిలో మెదులుతూనే ఉన్నాయి.

చుంచనకోట గుట్టల్లో నక్క

సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తింపు



సీసీ ఫుటేజీలో నమోదైన నక్క చిత్రం

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని చుంచన కోట గుట్టల్లో నక్క సంచరిస్తుందని ఫారెస్టు అధికారి రాముడు తెలిపాడు. మంగళవారం గుట్ట ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించిన ఆయన గుట్టల్లో నక్క సంచరిస్తున్నట్లు నిర్ధారణకు వచ్చాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో పెద్దగుట్ట ప్రాంతంలో ఓ రైతుకు చెందిన దూడను చంపిన ఘటనపై జంతువును గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా అందులో పెద్ద నక్క సంచరిస్తున్నట్లు రికార్డు అయినట్లు తెలిపారు. ఈ ప్రాంత రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

గౌరవెల్లిలో సంచరిస్తున్నట్లు అనుమానం!

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గౌరవెల్లి గ్రామ శివారులోని గుట్టల్లో నక్క సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు అనిత, సాజిద్ పాషా అనుమానిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం అటవీ శాఖ అధికారుల బృందం గౌరవెల్లి గ్రామ శివారులోని గుట్టల్లో పర్యటించి, జంతువుల ముద్రలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ట్రాఫ్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా అందులో నక్క జాతికి చెందిన అడోరకం నక్క లాంటి జంతువు ఉన్నట్లు ఫొటో కనిపించిందన్నారు. ఏదైనా అడవి జంతువులు సంచరిస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు.

కదిలే రైలు కిందపడిన ప్రయాణికుడు..

- మణికట్టు వరకు తెగిపడిన చేతులు
- ఆస్పత్రికి తరలింపు



తీవ్రంగా గాయపడిన అనిల్

జహీరాబాద్: జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో నీళ్లు పట్టుకునేందుకు దిగిన ప్రయాణికుడు అనిల్ కదులుతున్న రైలెక్కే ప్రయత్నంలో రైలు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. రైల్వే శాఖ కథనం ప్రకారం... మహారాష్ట్రలోని ఔరంగాబాద్ నుంచి తిరుపతి వెళుతున్న రైలు ఉదయం 11.30 గంటల ప్రాంతంలో జహీరాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ఈ క్రమంలో నీటిని పట్టుకునేందుకు ప్లాట్‌ఫాం నల్లా వద్దకు వెళ్లాడు. నీరు పట్టుకుంటుండగా రైలు కదిలింది. అప్రమత్తమై రైలెక్కే క్రమంలో అదుపు తప్పి రైలు కింద పడిపోయాడు. ఈ ఘటనను గమనించిన ప్రయాణికులు పెద్దగా కేకలు వేయడంతో రైలు వెనుకాల ఉన్న గార్డు డ్రైవర్‌కు సమాచారం ఇవ్వడంతో రైలును నిలిపివేశాడు. వెంటనే అతడిని రైలు కింద నుంచి బయటకు తీసి జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి, పరిస్థితి విషమంగా ఉండటంతో గాంధీకి తరలించారు. ప్రమాదంలో ప్రయాణికుడి రెండు చేతులు మణికట్టు వరకు తెగిపోయాయి. గాయపడిన అనిల్ ఔరంగాబాద్ జిల్లాలోని సిలార్ గ్రామానికి చెందిన వాడు. ఇతడు తిరుపతికి వెళుతున్నట్లు రైల్వే వర్గాలు పేర్కొన్నాయి.

విధుల్లోనే కుప్పకూలారు..

గుండెపోటుతో ఇద్దరు ఉద్యోగుల మృతి



దర్కు పండరి



షాబుద్దీన్

నారాయణఖేడ్: విధుల్లో ఉండగా గుండెపోటుకు గురై మంగళవారం ఇద్దరు ఉద్యోగులు మృతి చెందారు. కంగ్టి మండలం పంచమల్ దామర్‌గిద్దకు చెందిన దర్కు పండరి(40) హైదరాబాద్ మియాపూర్‌లోని ఆర్టీసీ డిపో–2లో కండక్టర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం డిపోలో విధినిర్వహణలో ఉండగా గుండెపోటుతో కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందినట్లు మృతుడి కుటుంబీకులు తెలిపారు. కాగా మరో ఘటనలో మిషన్ భగీరథ ఖేడ్ సబ్ డివిజన్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా షాబుద్దీన్(45) పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం తన సొంత గ్రామమైన ఝరాసంగం మండలం కుప్పానగర్‌లో గుండెపోటుతో మృతిచెందాడు. ఉద్యోగుల మృతితో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

మెదక్ కలెక్టరేట్: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని హైదరాబాద్ సెక్రెటేరియెట్‌లో సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డికి వినతిపత్రం అందజేసినట్లు 2008 డీఎస్సీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57 ఆధారంగా ఇటీవల రాష్ట్ర హైకోర్టు 3 నెలల్లో అమలు చేయాలని తీర్పు ఇచ్చిందని చెప్పారు. హర్షవర్ధన్ రెడ్డి, వినోద్ కుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

వికలాంగురాలి ఇంట్లో చోరీ

రూ.90వేలు అపహరణ

వట్‌పల్లి(అందోల్): ఒంటరిగా నివాసం ఉంటున్న వికలాంగురాలి ఇంట్లో చోరీ జరిగింది. బాధితురాలి వివరాలు ఇలా... అందోల్ మండల పరిధిలోని చింతకుంట గ్రామానికి చెందిన వికలాంగురాలు సింగి లక్ష్మమ్మ ఇటీవల బ్యాంకులో దాచుకున్న డబ్బులలో రూ.90 వేలు డ్రా చేసుకొని తీసుకువచ్చి ఇంట్లో దాచుకుంది. ఈ నెల 14న ఇంటికి తాళం వేసి అదే గ్రామంలోని బంధువుల వద్ద విందు కార్యానికి వెళ్లింది. భారీ వర్షం కురవడంతో రాత్రి అక్కడే ఉండి, 15న మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా నగదు కనిపించలేదు. దీంతో జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వృద్ధుడు అదృశ్యం



వడ్డె హన్మయ్య

నారాయణఖేడ్: ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి కథనం ప్రకారం... మండలంలోని తుర్కాపల్లికి చెందిన వడ్డె హన్మయ్య (65) గతనెల 15న ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడికి మతిస్థిమితం సక్రమంగా లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తప్పిపోయిన వృద్ధుడి అప్పగింత

సంగారెడ్డి క్రైమ్: మానూరు మండలం డోవూరు గ్రామానికి చెందిన కుర్మం నర్సింలు(53), ఈ నెల 13న మధ్యాహ్నం అల్లుడి ఇంటికని వచ్చి బస్టాండ్‌లో తప్పిపోయాడు. బస్సు దిగిన వెంటనే అల్లుడికి ఫోన్‌లో సమాచారం అందించాడు. దీంతో అల్లుడు అక్కడికి వచ్చి చూడగా నర్సింలు కనిపించలేదు. సోమవారం ఉదయం బస్టాండ్ ఆవరణలో వృద్ధుడిని గమనించిన పోలీసులు స్టేషన్‌కు తరలించి, వివరాలు తెలుసుకొని నర్సింలును అల్లుడు శ్రీకాంత్‌కు అప్పగించారు.

నాచారంలో యువతి..



శైలజ

వర్గల్(గజ్వేల్): యువతి అదృశ్యమైన ఘటన మండలంలోని నాచారంలో జరిగింది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కమ్మరి కృష్ణ కూతురు శైలజ(21) సోమవారం రాత్రి తల్లి దండ్రులతో కలిసి భోజనం చేసి అందరూ పడుకున్నారు. అదేరోజు రాత్రి 10.30 గంటలకు తండ్రి లేచి చూస్తే కూతురు కన్పించలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇండ్లలో వెతికినప్పటికీ ఆచూకీ దొరకలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చరిత్రను వక్రీకరిస్తే క్షమించరు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

మద్దూరు(హుస్నాబాద్): బైరాన్‌పల్లి పోరాటంతో ఎలాంటి సంబంధం లేని బీజేపీ నాయకులు ఈ పోరాటానికి మేము వారసులం అని చెప్పుకోవడం సిగ్గుచేటు అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. బైరాన్‌పల్లి చరిత్రను వక్రీకరిస్తే ప్రజలు క్షమించరు పేర్కొన్నారు. మంగళవారం దూల్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన అమరవీరుల సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై అమరవీరుల స్తూపం, బురుజు వద్ద పూలమాల వేసి నివాళుర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ పోరాటం కుల, మతాలకు అతీతంగా సాగిన గొప్ప పోరాటం అని అన్నారు. రజాకార్లు బైరాన్‌పల్లి, కూటిగల్ గ్రామాలపై ఒకే రోజు దాడి చేసి 108 మంది చంపినా, మిగిలిన వారు భయపడకుండా ఎర్ర జెండా పట్టుకుని పోరాటం చేశారని తెలిపారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఈ పోరాటాన్ని వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలని దొంగ నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. బైరాన్‌పల్లి గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి అర్హులైన పోరాటయోధులకు పింఛన్‌ను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చుక్క రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు రవీందర్, యాదవరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాలస్వామి, శశిధర్, సత్తిరెడ్డి, భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటమావో, యాదగిరి , అరుణ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను అడ్డుకున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): సర్వే చేసేందుకు వచ్చిన రెవెన్యూ సిబ్బందిని రైతులు అడ్డుకుని ఈ ఘటన మండల పరిధి చిన్నగొట్టిముక్ల గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామ శివారులో భూమి కొనుగోలు చేసిన ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి బయాన చెరువు పక్క నుండి నక్షబాట ఉందని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో మంగళవారం తహసీల్దార్ కమలాద్రి, ఆర్ఐ కిషన్, సర్వేయర్ అరుణ్‌కుమార్ సర్వే చేసేందుకు వెళ్లగా రైతులు ఆందోళన చేపట్టారు. గతంలో ఉపాధిహామీ ద్వారా వేసిన రోడ్డు ఉందని, కావాలనే తమ పొలాల నుండి బాట తీసేందుకు ప్రయత్నిస్తున్నారని రైతులు పాపయ్యచారి, నర్సింలు, సలీం, అశోక్, గంగారం, అన్వర్, పాషామియ్య వాపోయారు. వీరికి మద్దతుగా బీజేపీ నాయకులు పాల్గొన్నారు. రెవెన్యూ రికార్డు పరంగా నక్షబాట ఉందని, దరఖాస్తు చేసుకున్నందునే అక్కడికి వెళ్లామని తహసీల్దార్ తెలిపారు. రైతులు అడ్డుకోవడంతో 10 రోజుల సమయం ఇచ్చామని చెప్పారు.

పురుగుల మందు తాగి యువకుడు..



ఆనంద్

హవేళిఘణాపూర్(మెదక్): పురుగుల మందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని శమ్నాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా... గ్రామానికి చెందిన పట్నం స్వరూప, శంకరయ్య రెండవ కుమారుడు ఆనంద్(26) హైదరాబాద్‌లోని మెడికల్ షాపులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గత ఆదివారం ఇంటికి తిరిగి వచ్చిన ఆనంద్ శమ్నాపూర్ గేటు వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గ్రామస్తులు కుటుంబీకులకు సమాచారం అందించగా మెదక్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడు ప్రేమ విఫలమై పురుగుల మందు తాగాడని కుటుంబీకులు అనుమానిస్తున్నారు.

రైలు కింద పడి వృద్ధుడు..

జహీరాబాద్: జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో కదులుతున్న రైలు కింద పడి వృద్ధుడు మరణించాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం... మంగళవారం మధ్యాహ్నం 11.30 గంటల ప్రాంతంలో ఔరంగాబాద్ నుంచి తిరుపతి వెళుతున్న రైలు కింద పడి టి.నర్సింహులు(65) అక్కడికక్కడే మరణించాడు. ఝరాసంగం మండలం ప్యాలవరం గ్రామానికి చెందిన నర్సింహులు పట్టణంలోని శాంతినగర్ కాలనీలో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. కాలనీ పక్కనే ఉన్న రైల్వే స్టేషన్‌లోకి నీళ్లు తాగేందుకు వెళుతున్న క్రమంలో రైలు కిందపడి ఉండవచ్చని, లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా? అనే కోణంలో రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి..



కుమ్మరి కృష్ణ

హత్నూర(సంగారెడ్డి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని చీకమద్దూర్ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబీకుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కుమ్మరి కృష్ణ(45) గ్రామ శివారులోని దుబ్బ చెరువు నీటిలో కుమ్మరి కృష్ణ పడిపోగా గ్రామానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులు మచ్చుకూరి సత్యనారాయణ, నీరుడి ఏసు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ అతడు మృతి చెందాడు. కాగా అతని మృతిపై అనుమానం ఉన్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృతుడు కృష్ణకు ఇద్దరు భార్యలు, నలుగురు పిల్లలు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ రెడ్డి తెలిపారు.